కథానిక

# దెయ్యం చేసిన మేలు

సమయమంత్రి వసంతదేవి

ఆ నీలి రంగు కారు తిరిగితిరిగి వచ్చి, ఆనంద భవనపు గేటు ముందు ఆగింది. ఆ కారు ఆగటం చూడగానే లోనుండి, ఒక పాతికేళ్ళ యువకుడు గబగబా యివతలకు వచ్చాడు. అతని వైఖరి చూస్తే ఆ కారు కోసమే నిరీక్షిస్తున్నట్లు తోస్తుంది.

ఇంతలో లోనుండి "అప్పీ, కారు తలుపు తియ్యవే" అని సన్నని కంఠం వినిపించింది. ఆ యువకుడు మెడ కొంచెం ముందుకు జాపి పరికించాడు. అప్పి కారు తలుపుతీసి దిగింది. వెనువెంట ఒక సన్నని మెరుపు తీగలాంటి యువతి దిగింది.

"ఓ మీరేనా శ్రీమతి గిరిజాదేవి బి.ఏ., గారు? ఈ ఆనంద భవనపు యజమానిగారు?" అని ఆ యువకుడు ప్రఫుల్ల వదనంతో అడిగాడు.

"ఆ. ఆ పేరు నాదే" అంటూ ఆ యువతి "అప్పీ, రావే" అని గబగబా లోనికి నడిచిపోసాగింది.

ఆమె ప్రవర్తన చూసి కొద్దిగా దిగ్భ్రమ చెందిన ఆ యువకుడు కొంచెం తమాయించుకుని, గబగబా వారిని చేరి ఆమెతో అన్నాడు:

"మీకీ భవనం కొత్తది గనుక దీన్ని కొంచెం పరిచయంచేసి తాళాలు అప్పగించి పోదామని వచ్చాను."

"పరిచయం చేయవలసిన అవసరం అంతగా లేదనుకుంటాను. అయినా మీరు అంటున్నారు కాబట్టి, నాకేం అభ్యంతరం లేదు" అంటూ ఆ యువతి లోనికి నడువసాగింది.

పరిచయం చేయవలసిన బాధ్యత తనపైన ఉందనుకున్న ఆ యువకుడు, ఒక్కొక్క గదిని గురించి చెప్పుకుంటూ ఆమెతో నడువసాగాడు.

ఇక్కడ ఆనందభవానికి అధికారిణి అయిన శ్రీమతి గిరిజాదేవిని మీకు కొంచెం పరిచయం చేయాలి.

శ్రీమతి గిరిజాదేవి ఒక సత్సంప్రదాయం కలిగిన సంపన్న గృహంలో పుట్టింది. అతి సనాతనమూ, అతి ఆధునికమూ కాని గృహంలో పుట్టినదవటంవల్ల, ఆమె చదువు స్కూలు ఫైనలు వరకు సాఫీగా జరిగిపోయింది. ఈ లోపున ఆమె తండ్రి విదేశాలకు వెళ్ళి మోయలేనంత ధనంతోనూ, అంతకు మించిన పేరుతోను తిరిగివచ్చి, మద్రాసు వదిలి, కలకత్తాలో కాపురం పెట్టాడు. తల్లి లేని పిల్ల అవటంవల్లను, అందిస్తే అల్లుకుపోయే రకటం వల్లనూ, ఆమె చదువుకూ, ఆమె సరదాలకూ తండ్రి ఏమీ అభ్యంతరం పెట్టకపోగా, మరింత దోహదం యిచ్చాడు. అందుచేత గిరిజకు చదువుతో పాటు హోదా, దర్జా మొదలైన గుణా లన్నీ తగుమాత్రంగా పెరుగుతూ వచ్చాయి. స్వతహాగా వున్న అందాన్ని మరింత పెంపొందించుకున్న దవటంవల్లనూ, డబ్బున్న దవటం వల్లనూ, విద్యా సంస్కారమూ, సంగీత సాహిత్యాలు కలదవటంవల్లనూ, ఆమె త్వరలోనే అతి నవీన యువతుల్లో ఒకత్తెగా తయారయి కూర్చుంది.

ఈ మధ్యనే ఆమె తండ్రి గతించాడు. అందుచేత కొంచెం విచారాన్ని శాంతింపచేసుకోడానికైతేనేమి, లేక ఆ కలకత్తా వీథుల గందరగోళంనుంచి తప్పించుకోటానికైతేనేమి, తన అవసరాలకూ, తన హోదాకూ సరిపడకపోవటం మూలానైతేనేమి, ఆమెవున్న యిల్లు విడిచి పెద్దదైన మరొక యిల్లు కొందామనే ప్రయత్నంలో వుంటూవచ్చింది యీమధ్య.

సరిగ్గా యీ సమయంలోనే ఆనంద భవనం అమ్మకానికి వచ్చింది. ఆనంద భవనాన్ని గురించి అంతా వింతగా చెప్పుకోటం ఆమెకూ తెలుసు. ఆనందభవనం చాలా పెద్దది. నాలుగు అంతస్తుల మేడ. చుట్టూ చాలా పెద్ద స్థలమూ, దాని నిండా రకరకాలైన వృక్షాలు, చుట్టూ

అందమైన ప్రహారీ, లోపల నత కొలనూ, భవనమంతా అందమైన చెక్కడమూ యివన్నీ ఆమె రకరకాలైన మనుష్యులద్వారా వినింది.

ఆనందభవనపు యజమానులు కూడా చాలా ఆస్థిపరులే. అయితే ఏ కారణంవల్లనో వారా భవనాన్ని అమ్మకానికి పెట్టారు.

ఇంతకు ముందే దాన్ని గురించి చాలా విని వుండటంవల్ల, గిరిజ, ఆ భవనం అమ్మకానికి వచ్చిందనగానే ప్రస్తుతం వున్న ధరకు పది హేను వేలు అదనంగా వేసి లక్ష రూపాయలూ పెట్టి, ముందూ వెనకా చూడకుండా ఆ ఇల్లు కొనేసింది.

ఆ రాబోయే లక్ష్మీవారమే గృహ ప్రవేశం అవటంవల్ల, తను ఏర్పాట్లు కావించుకోటానికి ఆమె ఆ ఆదివారమే యిల్లు ఒకసారి చూడటానికని చిన్నప్పట్నుంచీ పెంచిన దాదితో బయలుదేరి వచ్చింది.

ఈ ఆనందభవనం అందరూ అనుకుంటున్న దానికన్నా తను వూహించుకున్న దానికంటే ఎక్కువ అందంగా ఆహ్లాదకరంగా వుండటం వల్ల ఆమె ఒక్కసారిగా సంతోష సముద్రంలో మునిగిపోయింది. ఒక్కొక్క గదీ ఆ చెక్కడమూ చూస్తున్న కొలదీ, గిరిజకు మూర్ఛ వస్తున్నంత పని అవుతూ వచ్చింది.

ఆ యువకుడు ప్రతి గదినీ చూపించి, తన శాయశక్తులా తన కర్తవ్యం అనుకున్నంతవరకూ లోపం లేకుండా వర్ణిస్తూ వచ్చాడు.

కాని, గిరిజ యిదేమీ వినే స్థితిలో లేదు. ఆమె పూర్తిగా తన ఆనందాన్ని విడమర్చి అప్పికి చెప్పటంలో నిమగ్న అయిపోయింది.

"చూశావే అప్పీ, ఇంత బాగుంటుందనుకో లేదు సుమీ. అబ్బ ఏమి అందం, ఏం శిల్పం. నిజంగా అజంతాలా వుందంటేనమ్ము. "అప్పీ, ఇటు చూడవే, యిక్కడ. అబ్బ యీ పాల రాతి చెక్కటం ఎంత బాగుందో! అబ్బ నిజంగా ఏదో లోకాల్లో విహరిస్తూన్నట్లే వుందిసుమీ. అప్పీ యిటుచూడవే, అబ్బ! యిటే యిటూ. ఈ కిటికీలోంచి చూడు, ఆ తోటంతా ఎంత అందంగా మెరుస్తూందో యీ నీరెండలో."

తను మాటాడడం కంఠశోష మాత్రమే అని తెలుసుకోడానికి ఆ యువకుడికి అరగంట సేపు పట్టింది. అది తెలుసుకున్న తర్వాత విచారపడినా, లాభంలేదని తెలుసుకుని నిశ్శబ్దంగా వూరుకుని చూపించటం మొదలు పెట్టాడు. అతని మెదడులో ఏవేవో ఆలోచనలు తిరగటం మొదలుపెట్టాయి.

ఇలా నెమ్మదిగా ఆ భవనం మూడు అంతస్థులూ చూపించి నాలుగో అంతస్థులోకి తీసుకు వెళ్ళాడు. ఆ యువకునికి ఏమి స్ఫురించినదో కాని గిరిజవేపు తిరిగి,

"గిరిజాదేవిగారు, ఇప్పుడు మీకొక అత్యంత ముఖ్యమైన విషయం నేను చెప్పాలి. మీరు చిరాకుపడకుండా ఓక్షణం ఓపిక పడతారా?" అన్నాడు

"ఆ ముఖ్యమైన విషయమేదో తొందరగా కానీండి" అంది గిరిజ కొద్దిగా విసుగుతో.

"ఈ గృహం చాలా పురాతనమైనది. ఇందులో చాలా తరాలు గడిచాయి నీ నెరిగున్నంతవరకూ."

"అబ్బా. ఆ తరాల గొడవెందుకు? అసలు విషయమేదో త్వరగా తేల్చెయ్యండి నాకు టైములేదు" అంది వాచీ చూసుకుంటూ.

"వచ్చే. అసలు విషయంలోకే వస్తున్నాను. ఇప్పుడు మీ కీభవనం అమ్మిన అతని తాతతరం వరకూ సవ్యంగానే గడిచింది. ఈ భవనాన్ని చూసి మీరెల్లా మక్కువ పడ్డారో అందరూ అల్లాగే మక్కువ పడేవారు. ఆయనకి యిద్దరు భార్యలు వుండేవారు. అందులో రెండో ఆమె భర్తకన్నా, స్వంత బిడ్డలకన్నా, అందరికన్నా కూడా, ఈ యిల్లంటే ఎక్కువ ఇష్టపడేది. చూశారూ ఆ ఎదురుగుండా వుండే ఆ గదిలోనే ఎప్పుడూ పడుకొనేది" అంటూ గిరిజకేసి చూశాడు. కాని గిరిజ యిది పట్టింపుగా వింటున్నట్లు తోచలేదు. అల్లా పిట్టగోడ నానుకుని వీధిలోకి చూస్తోంది.

అతను మళ్ళీ మొదలెట్టాడు, "మామూలుగానే కాలం గడుస్తోంది. ఒక నాడు ఆమె నిద్రనుంచి లేచి ఎప్పటికీ రాకపోటం మూలాన్ని వీళ్లు తలుపులు బ్రద్దలుగొట్టి లోపలకు వెళ్ళారు. చూస్తే ఏముంది? ఆమె చచ్చి పడివుంది. గోడమీద..." అని ఆగి

"అచ్చే. మీ కంత విసుగ్గావుంటే చెప్పను లెండి" అన్నాడు.

ఆమె నవ్వుతూ "ఊఁ, కానివ్వండి. కథ బాగానే అల్లారు కాని మధ్యలో ఆ వేళా కేం?" ఇదివిన్న ఆ యువకుడు కొంచెం ఆశ్చర్య పడినట్లు కనపడ్డాడు.

"నేను అల్లినకథ అనుకుంటున్నారు మీరు. కాని యిది చాలా నిజం. లేకపోతే యింత చక్కటి భవనం దీని యజమానులు ఎందుకు అమ్మారనుకుంటున్నారు. ఆవిడ దయ్యమై తిరుగుతుంది యీ భవనంలో."

"అబ్బా. చూసినట్లే చెప్తున్నారు. ఇంత చదువుకున్న మీకు దయ్యాలమీద నమ్మక ముందంటే నాకు చెడ్డ నవ్వొస్తోంది." అంటూ ఆమె పకపకా నవ్వసాగింది.

అప్పి మాత్రం "అల్లా గనకండి అమ్మా, ఏమో?" అంది.

"చూశారా, మీరు నూరిపోసింది మా అప్పికి బాగా ఒంట బట్టింది. ఐతే అది తాత తరంకదా! తర్వాత వాళ్లెల్లా వుండగలిగారు?" అంది.

"వాళ్లా వాళ్లెప్పుడూ ఇక్కడ వుండే వారు కారు. తాతలనాటి భవనం చూసి చూసి అమ్మలేక వేరే వుంటూవచ్చారు. ఇప్పటి యజమాని ఆ కాస్త పనీ తెగించి చేసేశాడు. ముందూ వెనకా చూడకుండా మీరు కొనేశారు" అన్నాడు

"చూశారూ, మొత్తంమీద మా అప్పికి బాగా ఎక్కించారు. ఇక నన్ను చంపుతుంది. రా. టైం అయిపోతోంది" అని చరచరా దిగి క్రిందికి వెళ్లిపోయింది.

ఇంత వాగిన తన వాగుడుకు వుపయోగం లేకపోగా, పోతూ కాస్త "థ్యాంక్స్" ఐనా చెప్పకండా పోయిందేమో అని, నాలుగో అంతస్థులో నిలబడ్డ ఆ యువకుడు చాలా సేపు కించపడ్డాడు.

* * *

అందరూ ఎదురుచూస్తూన్న అత్మీవారం ఎల్లాగో రానే వచ్చింది. ఆనాడే గృహ ప్రవేశం. ఆనందభవనం గేటు ముందర ఎన్నో కారులు దారి బందోబస్తు చేస్తున్నాయి. లోపల భవనమంతా పచ్చటి తోరణాలతో పసుపు కుంకుమ అద్దిన గడపలతో కళకళ లాడిపోతోంది.

డబ్బూ, చదువూ, దర్జావున్న గిరిజాదేవికి స్నేహితులకు కొదవేముంటుంది గనుక. రక రకాలవారు బాదరాయణ సంబంధాలు కల్పించుకుని మొత్తానికి చాలామందే వచ్చారు. తగిన విధంగా గిరిజా సత్కరించింది.

ఆనంద భవనాన్ని గురించి వచ్చిన వారందరూ తమ సంతోషాన్ని వెలిబుచ్చలేక తడబడుతూంటే, గిరజ ఒక్కసారిగా దేవలోకాల్లో విహరిస్తూన్నట్లే అనిపించింది. అదృష్టవశాత్తు తనకీ భవనం భగవంతుడిచ్చినదిగా భావించసాగింది.

నాలుగు రోజుల వరకూ, అతిథి సత్కారం మర్యాద తలకు మించిన కార్యక్రమాలతోటే సరిపోయింది గిరిజకు. ఆ తరువాత నెమ్మదిగా అందరినీ సాగనంపటంతోను, అన్నీ సర్దుకోవటంతోను మరో వారం రోజులు గడిచింది.

ఆర్డరిచ్చిన కొత్తఫర్నిచరు వచ్చాక, అంతా అలంకరించి, మూడో అంతస్థంతా తనకోసం ప్రత్యేకించుకుంది. అప్పి పోరు పడలేక నాలుగో అంతస్థు మాత్రం ఎలాగున్నది అలా ఉంచేసింది.

ఆనాడే కాస్త విశ్రాంతిగా పడుకొంది గిరిజ. అలసి వున్నమీదట హాయిగా నిద్ర పట్టేసింది.

ఓ రాత్రివేళ అప్పి కేకలతో గిరిజకు మెలకువ వచ్చింది తీరా చూస్తే అప్పి వణకిపోతూ నిలబడి వుంది దగ్గరలో. లైటువేసి సంగతేమిటని అడిగింది.

"నే చెప్పలేదండమ్మగోరూ! అదే అదే, సందేహమేంటి?" అంది వణుకుతున్న కంఠంతో.

అదేమిటో గిరిజకు అర్థం కాలేదు. "అదేమిటే, ఆ అది దయ్యమా, భూతమా?" అంది వేళాకోళంగా.

"ఇంకా ఏంటండమ్మగోరూ. దెయ్యమే, ఆ బాబు సెప్పే విన్నారుగోరు" అంది అప్పి.

"ఏమిటే, నీ ముఖం. దెయ్యమేమిటి?

పోయి పడుకో. హడావిడి చెయ్యకు. ఎక్కడా దెయ్యం? నాకు కన్పించదేం?" అంది గిరిజ.

"అబ్బే, మీరు నిదరోయారు. నా లంగో అంతస్థులో ఒకటే కేకలు. హడలి సచ్చానండి ఆ దెయ్యం ఎంత అల్లరి చేసిందనుకున్నారు" అంది అప్పి యింకా భయంతో.

"పడుకో. వెధవ నమ్మకాలు నూవ్వూను" అని లైటు తీసేసింది గిరిజ విసుగుతో.

కాని ఆ మర్నాడు కూడా, సరిగ్గా ఆ సంఘటనే జరిగింది. దీనితో గిరిజకు కొద్దిగా అనుమానం కలిగింది, "నిజంగా దెయ్యాలుంటాయా? ఛా, వుండవు. ఏమో, పూర్వులు ఊరికే వున్నాయన్నారా? వుంటే వుంటాయి. ఛీ ఛీ, దెయ్యాలేమిటి నాన్‌సెన్స్. చదువుకున్న తనుకూడా యిలా అనటం తన చదువుకే అప్రతిష్ఠ. అయినా పరీక్ష చెయ్యాలి" అనుకొంది.

మర్నాడంతా యివే ఆలోచనలతో గడిపింది. రాత్రి నిద్రపట్టలేదు. పన్నెండు గంటల వరకూ కూడా అలా మెలకువగానే కూర్చుంది. అవును. హఠాత్తుగా ఏదో పెద్ద అరుపు వినిపించింది. గిరిజకు ఒక్కసారిగా ఒళ్ళు చల్లబడినట్లయింది. ఆ తరువాత పెద్ద చప్పుడు. అంతే. మరింకేం లేదు.

అప్పి లేచి, పెద్ద కేక పెట్టి గొడవ చేసింది. గిరిజకు ముచ్చెమటలు పోసేస్తున్నాయి. క్రింద నున్న బంట్రోతు ఆ కేకకు పరిగెత్తుకొచ్చాడు. లైటు వేసి మాసేసరికి, గిరిజ స్థితి మరీ అధ్వాన్నంగా ఉంది.

గిరిజే కాసేపటికి ఎల్లాగో తమాయించుకొని అందర్నీ పంపేసింది. ఆ రాత్రంతా గిరిజకు కాళరాత్రిలా గడిచిపోయింది.

అవును పాపం అతను చెప్పనే చెప్పాడు. తనే వద్వేసింది. లేకపోతే హఠాత్తుగా ఎందుకమ్మేస్తారు. ఆ భవనంలో అంతకుక్రితం ఎవరూ వుండటం లేదని ప్రతీతి. వెర్రిది కనుకే ముందూ వెనకా చూడకుండా కొనేసింది. ఆ దెయ్యం యింట్లో వుండగా ఎలాగా మసలటం? అదిమాత్రం అసంభవం. దెయ్యాలున్నాయని ప్రత్యక్షంగా తెలుస్తూనేవుంది. ఆదెయ్యం రెండురోజులు చూసి, మీదకురికి పీక పిసికితే!

అబ్బే, వెధవ యిల్లు. తనెంత హేళనగా పోట్లాడింది. అవును, చిన్నప్పుడూ అమ్మమ్మ ఎన్నో దెయ్యాల కథలు చెప్పేది. అందులో దెయ్యం కూడా యిలాగే కూసేదిట. అయితే యిది నిశ్చయంగా దెయ్యమే అయి వుంటుంది.

ఆ రాత్రంతా యివే ఆలోచనలు. ఎంతకాదనుకున్నా అది దెయ్యమే అయివుంటుందన్న అనుమానం గిరిజకు బాగా నాటుకుపోయింది. ఆ మర్నాడే ఆ యిల్లు వదిలేసి, బేరానికి పెట్టడానికి నిశ్చయించుకొంది.

మర్నాడు ప్రొద్దుటే మేనేజర్ని పిలిచి తన నిశ్చయాన్ని తెలియ చేసింది.

"చూడండి మేనేజరుగారూ! నేరకపోయి యీ దెయ్యాల కొంప కొన్నాను ఎంతవచ్చినా సరే, యీ భవనాన్ని వెంటనే అమ్మేయండి. ఆ కబురు వినేవరకూ నాకు మనస్థిమితం వుండదు. ఇప్పుడే నేను ఏదోహోటల్లో గది చూసుకుని వుంటాను అందాకా" అంది.

మొదట యీ కబురు వినగానే ఆశ్చర్య పడినా, మేనేజరుగారు విధిగా తల వూపేరు.

కాని, కథ అంతటితో ఆగలేదు. అతి సుకుమారంగా పెరిగిన పిల్ల అవటంవల్ల, గిరిజ యీ దెబ్బకు తట్టుకోలేకపోయింది. ఆనాడే ఆమెకు వళ్ళు తెలియని జ్వరం వచ్చేసింది. వెంటనే హాస్పిటల్‌లో చేర్చారు.

మరి వారం వరకూ స్మృతి తెలియనట్లేపడి వుంది గిరిజ. ఒకటే కలవరింతలు. వచ్చేపోయే బంధువులకు లెక్కే లేదు. అసలే అలసిపోయి వుందేమో. దానిమీద యీ భయంతోటి జ్వరం రావటం హెచ్చుగానే వచ్చింది. కాని చిత్రం ఏమిటంటే, మేనేజరు వచ్చి ఆ భవనం అమ్మేశాను అంటేగాని, గిరిజకా జ్వరం వుధృతం తగ్గలేదు. అమ్మకంలో పదివేలు నష్టం వచ్చినప్పటికీ, అసలు ఏదో విధంగా ఆ భవనం అమ్మకం అయినందుకు గిరిజ చాలా సంతోషించింది.

జ్వరం తగ్గినప్పటికీ గిరిజమాత్రం అయిదు, ఆరు రోజులవరకూ తేరుకోలేక పోయింది. మరి నాలుగు రోజులు హాస్పిటలులోనే వుండాలని డాక్టరు చెప్పాడు.

ఆ రోజు నర్సు అడిగింది: "ఏమమ్మా రోజు సాయంత్రం వస్తాడు. అతనెవరు?" అని.

అవును అతనెవరు? తనకేం గుర్తు రావటం లేదు. ఎక్కడా చూసినట్లు కూడా లేదు.

"ఏమీ గుర్తురావటం లేదు. ఏమైనా పాపం సాయంత్రం అయ్యేసరికల్లా వస్తాడు."

"నిజమే. నీకు జబ్బు చేసిన దగ్గిర్నుండీ అంతే. ఎప్పుడూ తప్పలేదు మంచివాడులా వున్నాడు. రోజూ నీకు చాకలేట్లూ, గులాబి పువ్వులూ పట్టుకొస్తాడు" అంది నర్సు కొద్దిగా నవ్వుతూ.

"అవును మంచివాడే నాకు చాక్లెట్సంటే చాలా యిష్టం" అంది గిరిజ. ఏమైనా ఆ సాయంత్రం అతనెవరో అడగాలనుకుంది.

ఆ సాయంత్రం మామూలుగానే అతను వచ్చాడు. వస్తూనే చిరునవ్వుతో "మీకొంట్లో ఎలా వుంది?" అని అడిగాడు.

ఆమె "కులాసాగానే వుంది. కూర్చోండి" అంది మర్యాదకోసం.

"పాపం మీకు చాలా జబ్బు చేసింది. ఒళ్లు తెలియకుండా పడివుండేవారు" అన్నాడు.

"అవును. నాకెప్పుడూ జబ్బు చేయలేదు. ఇదే మొదటిసారి" అంది గిరిజ. కాసేపు ఇద్దరూ నిశ్శబ్దంగావుండిపోయారు ఆఖరికి గిరిజ తెగించి—

"మీ రెవరో గుర్తు రావటంలేదు. దయ చేసి ఏం అనుకోకుండా..." అని ఆపింది.

దాని కతనేం కించపడకపోగా చిన్న నవ్వు నవ్వేడు.

"మీరు అమ్మేసిన ఆనందభవనం కొన్న వాడిని నేనే" అన్నాడు.

"అయ్యో అది మీరు కొన్నారా? ఎందుకు కొన్నారు? పాపం చాలా అవస్థలో పడ్డారు. నే నిప్పుడు ఈ స్థితిలో వున్నానంటే అదే కారణం" అంది సానుభూతితో.

"ఏం? ఆ ఆనందభవనానికేమిటి లోపం? నేను బాగా ఎరుగుదునే" అన్నాడు.

"మీకు తెలియదు. అది దయ్యాల కొంప. అందులో ఏదో దెయ్యం తిరుగుతోందిట. నేను దాని అరుపు కూడా విన్నాను."

"అదేమిటీ, మీరు దయ్యాలంటే నమ్ము తారా? ఇంత చదువుకున్న మీకు దయ్యాల మీద నమ్మక ముందంటే, నాకు చెడ్డ నవ్వొస్తోంది" అంటూ అతను పకపక నవ్వాడు.

గిరిజకు గబుక్కుని జ్ఞాపకం వచ్చింది. ఇవి తను అన్న మాటలే. అవును ఆ రోజున భవనం చూడ్డానికి వెళ్లినప్పుడు, దెయ్యాలమీదట వచ్చి అంది కదూ! ఆ, ఆరోజున భవనం చూపించి నది యితనేకదూ!

"మీరు, మీరు ఆవాడు ఆనందభవనం చూపించినవారే కదూ!" అంది ప్రశ్నార్థకంగా.

"నయం, ఇప్పటికైనా గుర్తొచ్చాను. ఎలాగైనా మీ జ్ఞాపకశక్తి ప్రశంసనీయం" అన్నాడు నవ్వుతూ.

"ఆ రోజున మీరు చెప్పనే చెప్పారు. ఈ యింట్లో దెయ్యంవుందని. అయినా నేను విన లేదు. నా కామాత్రం జ్ఞానమేనా లేకపోయింది. లేకపోతే మీ రన్నట్లు ఏ కారణం లేకుండా అంత తొందరగా ఆ భవనం అమ్మేసు కుంటారా! నా తెలివిగానీ"

"జరిగిన విషయ మిది. యిప్పుడు మీకు చెప్పితే నష్టమేం లేదు కనుక చెప్తున్నాను. అసలాభవనం అందుకని అమ్మలేదు."

"నేను నమ్మను. అది దెయ్యాలకొంప."

"అసలు కథ సాంతం వినండి. ఆయింటి పూర్వపు యజమానిని నేనే. నేను పైదేశాలకు చదువుకని వెళ్లినప్పుడే నా తల్లిదండ్రులు గతించారు అప్పటినుండీ ఆ భవనం నిర్మానుష్యంగా వుంది. పైదేశాల్లో నాకు చదువుకంటే గుర్రపు పందాలు వెయ్యటం బాగా చేతనయింది. ఈ దేశం వచ్చినాకొ కూడా నన్నది వదల లేదు. చేతికందినంతవరకూ డబ్బంతా దానికి పెట్టేశాను. డబ్బు అవసరమైన యీ సమయంలో అనవసరంగా నిర్మానుష్యంగా పడి వున్న యీ ఆనందభవం నాకళ్ళబడింది.

వెంటనే అంటే రెండుమూడు నెలల క్రితం నేను దీన్ని అమ్మకానికి పెట్టటమూ వెంటనే మీరు కొనటమూ జరిగింది.

ఆ తర్వాత అంటే మీరు భవనం చూడటానికి వస్తానన్న రోజుకి నాలుగురోజుల క్రితమే నేను ఆ పందాలలో మూడులక్షలు గెలిచినట్లు తెలిసింది.

"సరే, మీకు ఓసారి భవనం చూపించేసి పోదామని ఆరోజు నేనుకూడా ఆనందభవనానికి వచ్చాను."

"అప్పుడు మీరు వీధిలోనుంచుని మాకోసం యెదురు చూస్తున్నారు కదూ?"

"ఆఁ అవును. మీకు భవనం చూపించటం మొదలు పెట్టేసరికి నాలో ఏ భావమూ లేదు. కాని, మీరు నే చెప్పేది వినకుండా ఆనందంలో మునిగిపోవటంతో, నాకు కొద్దిగా బాధ కలిగింది. కాని తర్వాత మీరు యీ భవనాన్ని అనేక విధాలుగా కవిత్వ ధోరణిలో పెట్టేసి వర్ణించటంతో యీ భవనాన్ని అమ్మటంలో ఎంత తెలివి తక్కువ పనిచేశానో, నేను పొందిన నష్టం ఎంత మహత్తరమైనదో అర్థం అవటం మొదలుపెట్టింది. మీరు వర్ణిస్తున్న కొద్దీ, ఎలాగైనా, యీ భవనాన్ని మళ్ళీ నా పరం చేసుకోవాలనిపించింది. చివరికి యీ దెయ్యాల వుపాయం పన్నాను."

"నిజంగా అది అంతా వట్టిదే?" అని అడిగింది గిరిజ. ఆమె అమాయకత్వానికి అతనికి నవ్వు వచ్చింది.

"వట్టిది! పచ్చి అబద్ధం. మీరు అప్పుడన్న మాటలను బట్టి నా వుపాయమేం సాగలేదని అనుకున్నాను. కాని వెంటనే మీరు యిల్లు అమ్మకం పెట్టటంతో, నా వుపాయం మహా చక్కగా పారిందని గ్రహించాను. మరేం లేదు. రోజూ రాత్రి పన్నెండు గంటల వేళ ఒక పనివాణ్ణి ఆ పక్కయింటి కప్పు మీద నుంచి అరవమని చెప్పాను. వాడు అలాగే మూడు రోజులు చేశాడు. మీరు ముందూ వెనకలు ఆలోచించకుండా యిల్లు అమ్మేశారు. వెంటనే కొనేశాను."

"ఏమిటి? మీరేనా ఆ పని చేయించింది. అయినా యిది మాత్రం నమ్మమని ఎక్కడ వుంది" అంది సందేహంతో.

"అచ్చే నిజమేనండి. ఆ యిల్లు కొన్నప్పుడు మీ మేనేజరు యీ సంగతి చెప్పారు. నా వుపాయం పారినందుకు సంతోషించినా, అనవసరంగా మిమ్మల్ని కష్టపెట్టాను కదా అని చాలా బాధపడ్డాను. భగవంతుడి దయవల్ల మీరు త్వరగానే తేరుకున్నారు" అన్నాడు.

"అనవసరంగా చాలా బాధపెట్టేరు. ఎంతో చక్కటి భవనం అది. ఎంతో ముచ్చటపడి కొన్నాను" అంది విచారంగా.

"అవును నిజమే. చాలా చక్కటి భవనం. అందుకే నేను తిరిగి కొన్నాను."

గిరిజ అతనికేసి ఎబ్బే ఏంమనిషి అన్నట్లుగా కోపంతో చూసింది.

"ఏమైనా. మీరా భవనం నాదగ్గిర్నుండి కృత్రిమంగా తీసుకొన్నారు" అంది.

"కాని మీరు యిష్టపడే అమ్మేరుగా."

"అయినా, మీరా దెయ్యం కథ అల్లకపోతే, నేనసలు జన్మజన్మాలకు అమ్మేదానినా!"

"పోన్లెండి. మీరంతగా విచారిస్తున్నారు కాబట్టి అందులోనే వుండండి" అన్నాడు.

"మరి మీరో?" అంది అనుమానంగా.

"నేనూ అందులోనే వుంటాను. దానివల్ల యిద్దరి కోర్కె నెరవేరుతుంది."

"అదెలా సాధ్యం?"

"ఏమి? మీ అంగీకారం, పెద్దల ఆశీర్వాద బలం వుంటే, సాధ్యమే కాకపోతుందా?" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

సంధ్యాఛాయలు, సన్నటి ఆమె పలువరస మీద పడి తళుక్కుమన్నాయి.

* * *

అందరూ ఎదురు చూస్తున్న ఆరోజు రానే వచ్చింది. ఆనాడే నూతన వధూవరుల గృహప్రవేశం. ఆనంద భవనం గేటుముందర ఎన్నో కారులు. లోపల భవనమంతా పచ్చటి తోరణాలతో, పసుపు కుంకుమ అద్దిన గడపలతో కళకళ లాడిపోతోంది.

ఇంతలో వధూవరులున్న నీలిరంగు కారు వచ్చి గేటుముందు ఆగింది. అందులోనుండి వధువు శ్రీమతి గిరిజాదేవి, వరుడు శ్రీ శేఖర్ దిగారు.

పురోహితుల పవిత్ర మంత్రోచ్చారణతో, బాజాభజంత్రీల చప్పుళ్ళతో, మంగళతూర్యాల మధురరాగంతో, వధూవరులు ఆనంద భవనంలో గృహప్రవేశమయ్యారు.